# రాజ్యాంగ సూత్రాల కన్నా కాంట్రాక్టర్ల ప్రయోజనాలు మిన్న



కె. బాలగోపాల్

'ఆదివాసీ ప్రాంతాలలో ఆదివాసీల స్వయంపాలన' అనే డిమాండు కొద్దికొద్దిగా కార్యరూపం దాల్చి అంతలోనే అంతరించిపోయే సూచనలు కనిపిస్తున్నాయి.

భూరియా కమిటీ సూచనలను అనసరించి పార్లమెంటు 1996లో ఒక చట్టం చేసింది. ఇది కేవలం చట్టం కాదు, రాజ్యాంగ సవరణే. అంతకు ముందు పంచాయితీ రాజ్ వ్యవస్థకు రాజ్యాంగంలో స్థానం కల్పిస్తూ చేసిన 73వ రాజ్యాంగ సవరణను షెడ్యూల్డు ప్రాంతాలకు (మామూలు పరిభాషలో 'ఏజెన్సీ' ప్రాంతాలకు) వర్తింపజేసే చట్టం ఇది.

షెడ్యూల్డు ప్రాంతాలు గల రాష్ట్ర చట్ట సభలు, షెడ్యూల్డు ప్రాంత గ్రామాల పంచాయితీలకు 'స్వయం పాలనాధికారాలు' తగు రీతిలో కల్పిస్తూ, స్థానిక ప్రణాళికలపైన, వాటికి అవసరమయ్యే వనరుల పైన నియంత్రణాధికారాన్ని పంచాయతుల చేతిలోనూ గ్రామసభలు చేతిలోనూ పెట్టాలని చట్టం అనింది. షెడ్యూల్డు ప్రాంతాలలో భూమి సేకరణ చేసేటప్పుడూ, నిర్వాసితులకు పునరావాసం కల్పించేటప్పుడూ పంచాయితీనీ గ్రామసభనూ సంప్రదించాలని అనింది. గనుల లైసెన్సులో లీజులూ ఇచ్చేముందు గ్రామసభ లేక గ్రామ పంచాయితీ సూచనలు తప్పక తీసుకోవాలని అనింది. చిన్న తరహా నీటివనరుల నిర్వహణ పంచాయితీలకే అప్పగించాలంది. చిన్నతరహా అటవీ ఉత్పత్తుల యాజమాన్యం, మద్య నిషేధాన్ని అమలు చేసే అధికారం, భూమి పరాయీకరణను నిలుపుదల చేసే అధికారమే కాక పరాయీకరణ చెందిన భూమిని దాని అసలు యజమాని అయిన ఆదివాసీకి అప్పగించే అధికారం, గ్రామంలో జరిగే అంగడిని నిర్వహించే అధికారం, అన్ని సామాజిక రంగాలలోని సంస్థలపైన, సిబ్బంది పైన అజమాయిషీ చేసే అధికారం పంచాయితీలకూ, గ్రామ సభలకూ ఇవ్వాలని కూడా చట్టం అనింది.

ఈ చట్టం కల్పించే 'స్వయం పరిపాలన' ఎంత సంపూర్ణమైనదనే చర్చ కొంచెంసేపు పక్కన పెడదాం. ప్రస్తుత విషయం ఏమిటంటే, ఈ చట్టం చేసి అయిదేళ్ళయినా దీని అమలు ఇంకా మొదలు కాలేదు. ఏజెన్సీ ప్రాంతాల గ్రామాల పంచాయితీలకూ గ్రామ సభలకూ ఈ అధికారాలు కల్పించే ప్రక్రియే

ఇంకా సరిగ్గా మొదలు కాలేదు. నిజానికి ఈ చట్టం మేరకే స్వయంపాలన కల్పించినా అది చాలా దూరం పోతుంది. సహజవనరులు సమృద్ధిగా ఉన్న షెడ్యూల్డు ప్రాంతాల విచ్చలవిడి దోపిడీకి అడ్డుకట్ట పడుతుంది. కానీ ఆ ప్రక్రియను పూర్తిగా ఆవిష్కరించే లోపలే దానికి తూట్లు పొడిచే ప్రయత్నాలు మొదలయ్యాయి.

నిజానికి 1996లో పార్లమెంటు ఈ చట్టం చేయడానికి ముందే, 1994లోనే మన రాష్ట్ర ప్రభుత్వ సోషల్ వెల్ఫేర్ శాఖ జివో30 అనే ఆదేశాన్ని జారీ చేసింది. ఏజెన్సీ గ్రామాలలో చేపట్టే అన్ని అభివృద్ధి పనులూ ఆర్థిక పరిమాణంతో నిమిత్తం లేకుండా స్థానిక మహిళా మండలులు, నీటిని వినియోగదారుల సంఘాలు, యువజన సంఘాలు, గ్రామ అభివృద్ధి సంస్థలు వగైరాలకు అప్పగించాలనీ, అందు నిమిత్తం వివిధ ప్రభుత్వ శాఖల ఇంజనీర్లు ప్రజలకు సాంకేతిక శిక్షణ ఇవ్వాలనీ ఈ జివో అంటుంది. అంటే ఏజెన్సీలో ప్రైవేట్ కాంట్రాక్టర్ల చొరబాటుకు అవకాశం లేకుండా చేసింది.

కేవలం అభివృద్ధి పనులు షెడ్యూల్డు ప్రాంతాలకే అప్పగించడమే కాక, అభివృద్ధికి సంబంధించిన విధాన లేక ప్రణాళికా రచన కూడా షెడ్యూల్డు ప్రాంతాలలో గ్రామ అభివృద్ధి సంస్థల అజమాయిషీలోనే జరగాలని ఆ తరువాత (1999లో) జారీ చేసిన జివో 20లో ప్రభుత్వం అనింది. ఈ జివో ద్వారా గ్రామ అభివృద్ధి సంస్థకు 'గ్రామ ఆదివాసీ అభివృద్ధి సంస్థ' (విటిడిఏ) అని పేరు మార్చారు. ఆ ఏజెన్సీ గ్రామంలో ఒకవేళ గిరిజనేతరులు ఉన్నా, వారికి అందులో చోటు ఉండదు, సభ్యత్వం ఉండదు. గ్రామంలోని ఆదివాసీలు మాత్రమే విటిడిఏ లో సభ్యులు.

ఇటువంటి జీవోలు ఉన్నాయని సగటు ఆదివాసీలకే కాదు, ఆదివాసీ సంఘాల కార్యకర్తలకు సహితం చాలావరకు తెలీదు. అటువంటి జీవో జారీ చేయడమే ఎక్కువనుకునే ప్రభుత్వం దానిని ప్రజలకు తెలియజేయడం కూడానా అన్నట్టు ఊరుకుంటుంది. అయినప్పటికీ రాష్ట్రంలోని కొన్ని ఏజెన్సీ ప్రాంతాలలో ఈ జీవోలు కొంతమేరకు అమలయ్యాయి. అభివృద్ధి ప్రణాళికా రచనపైన ఆదివాసీలకు అజమాయిషీ రాలేదు గానీ, చెరువు కట్టల మరమ్మత్తుల నుండి బిటి రోడ్ల నిర్మాణం దాకా వివిధ పనులు ఆదివాసీ విటిడిఏలకే అప్పగించిన ప్రాంతాలు రాష్ట్రంలో ఉన్నాయి. ఆ మరమ్మత్తులూ, నిర్మాణాలూ ఆదివాసీలు అసమర్థంగా చేసారని ఎవ్వరూ అనలేదు. అయితే సమస్య అదికాదు కదా! సివిల్ కాంట్రాక్టర్లకు చెందవలసిన లాభాలు ఆదివాసీ అభివృద్ధి సంస్థల పాలు కావడం సహించతరమా!

నిజానికి 'స్వయంపరిపాలన'లో ఇదొక చిన్న అంశం మాత్రమే. భూమి బదలాయింపు చట్టం అమలుపైనా, అభివృద్ధి ప్రణాళికా రచనపైనా అజమాయిషీ ఆదివాసీల చేతిలోకి రావాలి. అంతేకాక 1996 చట్టం ఊహించని మరొక అధికారం కూడా ఆదివాసీలకు దక్కాలి. అది రిజర్వ్ ఫారెస్ట్‌ను నిర్వహించే అధికారం. ఈ అధికారాలతో పోలిస్తే సివిల్ కాంట్రాక్టులు చిన్న విషయమే.

**అయితే ఆ చిన్న హక్కు కూడా ఆదివాసీల చేతిలో ఉండొద్దని దొరలు నిర్ణయించారు. ఎవరు ఎక్కడ మీటలు నొక్కారో తెలీదు గానీ రాష్ట్ర ప్రభుత్వం 1998లో జివో 90ని జారీ చేసింది.**

అయితే ఆ చిన్న హక్కు కూడా ఆదివాసీల చేతిలో ఉండొద్దని దొరలు నిర్ణయించారు. ఎవరు ఎక్కడ మీటలు నొక్కారో తెలీదు గానీ రాష్ట్ర ప్రభుత్వం 1998లో జివో 90ని జారీ చేసింది. ఈ జివో అభివృద్ధి ప్రణాళికా రచనపైన ఆదివాసీ గ్రామ సభల నియంత్రణ గురించి ఒక్క మాట కూడా మాట్లాడదు. మాట్లాడకపోగా, సివిల్ పనులు సహితం ఒక మోతాదు మించినవయితే విటిడిఏలకు ఇవ్వకుండా టెండర్ల ద్వారా కాంట్రాక్టర్లకు ఇవ్వాలని అంటుంది. రోడ్డు పనులయితే మొత్తంగానే విటిడిఏల చేతి నుండి తీసేసి కాంట్రాక్టర్లకు ఇవ్వాలంటుంది. ఈ మార్పు చేయడానికి ప్రభుత్వం ఏ కారణమూ చూపలేదు. ఎక్కడైనా విటిడిఏలకు ఇవ్వటం వల్ల నష్టం జరిగిందని చెప్పలేదు. చల్లగా జీవో జారీ చేసి ఆదివాసీలకు 'స్వయంపాలన' పేరు మీద ఇచ్చిన చిన్న హక్కును సహితం తీసేసింది.

1996లో పార్లమెంటు చేసిన చట్టం నిజానికి రాజ్యాంగంలో అంతర్భాగం అయినప్పటికీ అలవోకగా దానిని అతిక్రమించే జివో జారీ చేసి అమలు చేసేయడానికి ప్రభుత్వం సిద్ధపడిందంటే వారికి రాజ్యాంగ సూత్రాల కన్నా కాంట్రాక్టర్ల ప్రయోజనాలు మిన్న అని అర్థమవుతుంది!